ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 24.0



9

జీఎస్టీ తగ్గింపుతో కొత్త వెలుగు

నరసాపురం వశిష్ఠ గోదావరిలో పడవల ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి వర్మ, రాష్ట్ర మంత్రి సుభాష్, ఎమ్మెల్యే నాయకర్ తదితరులు



9

రెండు వేల మందికి ఉచిత కంటి పరీక్షలు

తణుకులో మెగా శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి



పాలకొల్లులో మంత్రి అచ్చెన్నాయుడిని సత్కరిస్తున్న మంత్రి నిమ్మల, సుభాష్, ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్, మాజీ ఎమ్మెల్సీ అంగర, మాజీ మంత్రి సుజాత తదితరులు

మార్కెట్ కమిటీల స్వయంప్రతిపత్తి

విద్యుత్ వెలుగులు

- ట్రూ అప్‌ల నుంచి ట్రూ డౌన్‌లోకి
- యూనిట్‌కు 13 పైసలు ఊరట.. జిల్లా వినియోగ దారులకు రూ.32 కోట్ల మేర వాపస్
- నవంబరు నుంచి వచ్చే ఏడాది అక్టోబరు వరకు చెల్లింపు



భీమవరం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):దీపావళి వేళ.. ప్రతి ఇంట విద్యుత్ వెలుగులు పూయనున్నాయి. జగన్ సర్కార్ ట్రూ అప్ చార్జీల పేరిట గతంలో వసూలు చేసిన సొమ్మును చంద్రబాబు సర్కార్ తిరిగి ప్రజలకు ఇవ్వనుంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జిల్లాలోని వినియోగదారులు వాడిన 21 కోట్ల మూడు లక్షల 34 వేల 289 యూనిట్లకు సంబంధించి ట్రూ డౌన్ పేరిట యూనిట్‌కు 13 పైసల వరకు తగ్గించనుంది. ఇది ఈ ఏడాది నవంబరు నుంచి వచ్చే ఏడాది అక్టోబరు వరకు విద్యుత్ బిల్లుల్లో తగ్గించి మిగిలిన బిల్లును వసూలు చేస్తారు. ఈ లెక్కన జిల్లాలోని వినియోగదారులకు రూ.32 కోట్ల మేర భారం తగ్గనుంది. ఒక్క నవంబరు నెలలోనే రెండు కోట్ల 75 లక్షల 95 వేల 856 రూపాయలు తగ్గుతుంది.

విద్యుత్ వాడిన నెలకు..	యూనిట్‌కు 13 పైసలు చొప్పున బిల్లు తగ్గించే నెల
2024 ఏప్రిల్‌కు	2025 నవంబరులో
మే నెలకు	డిసెంబరులో
జూన్‌కు	2026 జనవరిలో
జూలైకు	ఫిబ్రవరిలో
ఆగస్టుకు	మార్చిలో
సెప్టెంబరుకు	ఏప్రిల్‌లో
అక్టోబరుకు	మేలో
నవంబరుకు	జూన్‌లో
డిసెంబరుకు	జూలైలో
2025 జనవరికి	ఆగస్టులో
ఫిబ్రవరికి	సెప్టెంబరులో
మార్చికి	అక్టోబరులో



కార్తీకం స్పెషల్

జిల్లా నుంచి పంచారామ దర్శినికి 100 ఆర్టీసీ బస్సులు

భీమవరం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):కార్తీకమాసంలో భీమవరం, నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి భక్తుల సౌకర్యార్థం పంచారామ క్షేత్రదర్శిని టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్.వి.ఆర్.వరప్రసాద్ తెలిపారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు డిపోల నుంచి వంద బస్సులు ఏర్పాటు చేశాం. ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఇంద్ర సర్వీసులున్నాయి. టిక్కెట్టు ధర : ఇంద్ర బస్సుకు రూ. 1,600, అల్ట్రా డీలక్స్ రూ. 1,100, సూపర్ లగ్జరీ రూ.1,200 ఈ బస్సులు ఈ నెల 26, వచ్చే నెల 2, 9, 16 తేదీల్లో నడుస్తాయి. కార్తీకమాసం పూర్తయ్యే వరకు భీమవరం నుంచి శ్రీశైలం స్పెషల్ సర్వీసు నడపనున్నాం. ప్రతీ పౌర్ణమికి అరుణాచల యాత్ర స్పెషల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేణు, గీతావాణి సురేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రుణ భారం!

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు తాత్సారం చేస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యానికి ఇది పెద్ద ప్రతిబంధకంగా మారింది. దీనికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వం సూక్ష్మ రుణ ప్రణాళికను ప్రవేశపెట్టింది. మహిళా సంఘంలోని సభ్యురాలి అవసరం మేరకే రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు సర్వే నిర్వహించింది. జిల్లాకు అవసరమైన రుణ పరిమితిని గుర్తించి, బ్యాంకులకు జాబితాను పంపించింది. కాని, రుణాల మంజూరులో మాత్రం బ్యాంకర్లు వెనకడుగు వేస్తున్నారు. గతంలో మాదిరి గ్రూపు మొత్తానికి ఒకే తరహా రుణాలు ఇవ్వడానికే ఆసక్తి చూపుతున్నాయి. రికవరీలో ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాయి. అదే ఇప్పుడు మహిళలకు రుణాల మంజూరులో జాప్యానికి కారణం అవుతోంది. ఫలితంగా రుణాల కోసం మహిళలు, లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఓ వైపు బ్యాంకర్లతో సంప్రదింపులు జరుపుతున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు.

ఆమోదం సరే.. ఆచరణ ఏదీ

మైక్రో క్రెడిట్ ప్లాన్‌పై ఆసక్తి చూపని బ్యాంకర్లు



- డ్వాక్రా సంఘాల్లో వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు అనాసక్తి
- గ్రూపు అయితే రికవరీ బాగుంటుందని భావన
- ఏటా రెండు వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చేవారు
- ఈ ఏడాది లక్ష్యమే రూ.1,032 కోట్లు.. అందులోనూ ఇచ్చింది రూ.242 కోట్లే

గతంలో ఏటా దాదాపు రూ.2 వేల కోట్లు రుణాలు ఇచ్చేవారు. తిరిగి చెల్లింపులలో మహిళలు ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన ప్రభుత్వం గ్రూపులో అవసరమైన మహిళలకు మాత్రమే రుణాలు మంజూరు చేసేలా మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను అమలు చేసింది. ఫలితంగా రుణ లక్ష్యం తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని రుణార్హత సాధించిన 25,754 డ్వాక్రా సంఘాలకు రూ.1,032 కోట్లు ఇవ్వాలి. అయినా బ్యాంకులు సక్రమంగా మంజూరు చేయడం లేదు. ఇప్పటి వరకు 9,211 గ్రూపులకు రూ.242 కోట్లు మాత్రమే రుణాలు మంజూరుచేశారు. ఇంకా రూ.790 కోట్లు ఇవ్వాలి. జిల్లా అధికారులు బ్యాంకు మేనేజర్లతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేస్తున్నారు. పని ఒత్తిడి ఉంటోందని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. గ్రూపులోని ప్రతి మహిళకు వేర్వేరుగా రుణాలు ఇవ్వాల్సి వస్తోంది. గతంలో గ్రూపు మొత్తానికి ఇచ్చేవారు. రుణం మొత్తం తీసుకుని మహిళలు సమానంగా పంచుకునేవారు. ప్రతీ నెలా క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించే వారు. డ్వాక్రా రుణాలకు సంబంధించి రికవరీ 99 శాతం ఉంటోంది. ఫలితంగా మహిళా గ్రూపులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ఆసక్తి చూపేవి. మైక్రో క్రెడిట్ ప్లాన్‌తో రుణ ప్రక్రియ తలకిందులైంది. లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

ప్రైవేటు బ్యాంకులు మొండిచేయి

- ప్రభుత్వం అమలు చేస్తున్న మైక్రో క్రెడిట్ ప్లాన్‌లో ప్రైవేటు బ్యాంకుల నుంచి సహాయ నిరాకరణ అధికంగా ఉంటోంది. కొద్దో గొప్పో జాతీయ బ్యాంకులే రుణాలు ఇవ్వడానికి ముందు కొస్తున్నాయి. ఇప్పటి వరకు మంజూరుచేసిన రూ.2.42 కోట్ల రుణాల్లో 80 శాతం మేర రుణాలు జాతీయ బ్యాంకులే సమకూర్చాయి.
- మైక్రో క్రెడిట్ ప్లాన్ అమలు చేస్తే గ్రూపు బాధ్యత ఉండదు. రికవరీ కోసం ప్రతి మహిళను సంప్రదించాలి. సక్రమంగా చెల్లించకపోతే ఇప్పటి వరకు గ్రూపు సభ్యులే ఒత్తిడి చేసేవారు. సహచర సభ్యులు క్రమం తప్పకుండా వాయిదా చెల్లించేలా చూసుకునేవారు.
- బ్యాంకులకు పనిభారం ఉండేది కాదు. ప్రస్తుత విధానంతో ప్రతి మహిళ అకౌంట్‌ను చూడాలి. రికవరీలోనూ తేడా వస్తుందని బ్యాంకుల్లో గుబులు మొదలైంది. దీంతో ప్రైవేటు బ్యాంకులు ముందుకు రావడానికి సాహసించడం లేదు.



చేనేత కార్మికుడిని సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

చేనేత, హస్తకళలకు పునరుజ్జీవం : కలెక్టర్

భీమవరం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న హస్తకళలకు, చేనేత ఉత్పత్తుల పునరుజ్జీవానికి క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ సీహెచ్ నాగరాణి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో చేనేత, జౌళి శాఖ, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంస్థ ఆధ్వర్యంలో చేనేత నైపుణ్య కార్మికులను సన్మానించారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంస్థ సెక్రటరీ ఎస్.రంజన మాట్లాడుతూ అంతరించిపోతున్న హస్త కళలు, చేనేత పరిశ్రమను ముందుకు నడిపించడానికి పదేళ్లుగా పని చేస్తున్నామన్నారు. ఆదరణ కోల్పోతున్న చేనేత రంగాన్ని, చేనేత కార్మికులను ఆదుకునేందుకు కౌన్సిల్ తరపున అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తమ కళా నైపుణ్యంతో చేనేత ఉత్పత్తులు చేస్తున్న చింతపర్రు గ్రామానికి చెందిన వీరగణపతి, వాసా భ్రమరాంబ, కె.వీర నరసన్నలకు రూ.25 వేల నగదు బహుమతులను కలెక్టర్ అందించి వారిని సత్కరించారు. చింతపర్రు, భగ్గేశ్వరం, రాయకుదురు, పాలకొల్లు, రామచంద్రపురం, దగ్గులూరు, భీమవరం, ఆచంట వేమవరాలకు చెందిన చేనేత కార్మికులను సన్మానించారు. జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఎ.అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, క్రాఫ్ట్ కౌన్సిల్ వైస్ చైర్మన్ బి.సుజాత, కౌన్సిల్ సభ్యులు పి.సునీత, డి.అవంతి, ఎస్.ప్రమీలరాణి, వివిధ గ్రామాల చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నేడు జీఎస్టీ - సేవింగ్స్ ముగింపు సభ

జిల్లాలో నెల రోజులుగా నిర్వహిస్తున్న 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' కార్యక్రమాల ముగింపు సభ శనివారం భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతుందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. దీనికి సంబంధించి అధికారులకు విధులు కేటాయించామని, వారు వర్తక వ్యాపారులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీపీఎస్‌కు గ్రీన్‌సిగ్నల్



- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- భవనాల క్రమబద్ధీకరణతో యజమానులకు ఎంతో మేలు
- జిల్లాలో 2,000 దరఖాస్తులు వస్తాయని అంచనా

భీమవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా చేపట్టిన భవన నిర్మాణాలు, అదనపు అంతస్తులను క్రమబద్ధీకరించుకునేందుకు ఉద్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్) అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించడంతో ప్రభుత్వం శుక్రవారమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలోని నిర్మాణదారుల్లో జోష్ నెలకొంది. వైసీపీ హయాంలో నిబంధనల పేరుతో ఎక్కడికక్కడ నిర్మాణాలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత వేగం పుంజుకున్నాయి. అలాగే కొందరు అనుమతులు తీసుకోకుండా, మరికొందరు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టారు. తెలియక కొందరు వాటిని కొనుగోలు చేసి ఇరుక్కుపోయారు. అలాగే అతిక్రమణల జాబితాలో అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ఏనాడో అపార్ట్‌మెంట్ పైఅంతస్తుల్లో కొనుగోలు చేసిన యజమానులకు అనుమతులు లేవు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేదు. తదుపరి మున్సిపాలిటీల చుట్టూ తిరిగినా సరే ఫలితం లేకపోయింది. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం పట్టణాల్లో ఇటువంటి నిర్మాణాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి వాటిలో పరిష్కరించదగిన భవనాలను బీపీఎస్‌లో రెగ్యులరైజ్ చేస్తారు. వారందరికీ సువర్ణ అవకాశంగా ప్రభుత్వం మరోసారి బీపీఎస్‌కు అవకాశం కల్పించింది. జిల్లాలో ఇలాంటి భవనాలకు సుమారు రెండు వేల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం వుందని అధికారులు భావిస్తున్నారు.

నిబంధనలు బేఖాతర్!

విచ్చలవిడిగా బాణసంచా వ్యాపారం - 9లో

గుడ్లు తేలేశారు..!

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనంలో వారానికి ఐదుసార్లు కోడి గుడ్లు, రెండు రోజులు మాంసా హారాన్ని అందించాలి. కాని, మెస్ నిర్వా హకుల మార్పుతో కొన్ని రోజులుగా గుడ్లు అందించడం లేదు. మాంసాహారాన్ని ఒక రోజుకే కుదించారు. దీనిపై విద్యార్థుల నుంచి విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల మెనూలో మార్పులు

కోడి గుడ్లు బంద్.. వారానికి ఒకసారే మాంసాహారం



- మెస్‌ల నిర్వహణ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగింత
- విద్యార్థులకు వీరు పెట్టేది వెజిటేరియన్ భోజనం మాత్రమే
- మాంసాహారం కాంట్రాక్టు వేరొకరికి అప్పగింతపై నిర్ణయం తీసుకోని ఆర్జీయూకేటీ అధికారులు
- పెరిగిన ఖర్చు.. నిర్వహణ భారం

(నూజివీడు టౌన్-ఆంధ్రజ్యోతి):

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో మెస్‌లను అక్షయ పాత్ర అనుబంధ హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఇటీవల అప్పగించారు. దసరా సెలవుల తరగతులు పునః ప్రారంభం కాగానే మెస్‌ల బాధ్యతను ఈ ఫౌండేషన్ స్వీకరించింది. వీరు కేవలం శాఖాహారాన్ని మాత్రమే అందిస్తారు. మెనూ ప్రకారం ఇవ్వాల్సిన కోడి గుడ్లు, మాంసాహారం అందించే బాధ్యతను వేరొక సంస్థకు అప్పగించాలి. అయితే ఇది ఎవరికి, ఎలా ఇవ్వాలో తెలియక ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. సెలవులు అనంతరం విద్యార్థులకు కోడి గుడ్లు ఇవ్వడం పూర్తిగా బంద్ అయింది. గత ఆదివారం మాంసాహారం ప్రయోగాత్మకంగా ఏర్పాట్లు చేసినా అందరికీ పూర్తిగా అందలేదు.

ఎనిమిది వేల మంది విద్యార్థులు

నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన ఆరు వేల మందితోపాటు శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌ల పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,200 మందికి ఇక్కడి హాస్టల్‌లోనే వుంటున్నారు. మొత్తం ఎనిమిది వేల మందికి 80-20 శాతం లెక్కన మాంసాహారం, శాఖాహారాలను విభజించి గతంలో 750 కేజీలు కోడి మాంసం, మిగిలిన వారికి పన్నీరుతో ఆహారాన్ని అందించేవారు. విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పడిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థను నిర్వహించే కొందరు అధ్యాపకులు తాత్కాలికంగా మాంసాహారం అందించే బాధ్యతను చేపట్టారు. గత ఆదివారం కేవలం 550 కేజీల కోడి మాంసం తీసుకుని వస్తే అది సరిపోలేదు.

పెరిగిన ఆర్థికభారం.. అయోమయం

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నూజివీడు, ఆర్కేవ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో దాదాపు 25 వేల మంది విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి వసతి సౌకర్యాలను అందించేందుకు గతంలో ప్రత్యేకంగా మెస్ క్యాటరర్స్ ఉండేవారు. వీరికి ఒక్కో విద్యార్థికి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనంతో కలిపి రూ.88 చెల్లించేవారు. ప్రస్తుతం సదరు మెస్ నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అక్షయపాత్ర అనుబంధ సంస్థ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగిస్తూ ఒక్కో విద్యార్థికి భోజనం అందించేందుకు రూ.110 చెల్లించేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు కోడిగ్రుడ్డు, మాంసాహారం అందించేందుకు ఒక్కో విద్యార్థికి రూ.6.70 పైసలు అదనంగా చెల్లించేందుకు నిర్ణయించినా సదరు బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే నిర్ణయం తీసుకోలేదు.

మాంసాహారం కాంట్రాక్ట్‌పై నేతల చూపు

విద్యార్థులకు మాంసాహారం అందించే కాంట్రాక్ట్‌ను మెప్మాకు లేదా విద్యార్థులకు సహాయ సహకారాలు అందించే హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అందించాలని ఆర్జీయూకేటీ ఉన్నతాధికారుల ఆలోచన. వీరిద్దరిలో ఎవరికి ఇచ్చినా తిరిగి బయట వారికి కాంట్రాక్ట్ ఇవ్వాల్సిందే. ఇప్పటికే ట్రిపుల్ ఐటీలోని ఫుడ్‌కోర్టును మెప్మాకు ఇవ్వగా 0.5 శాతం లాభానికి బయట వ్యక్తులకు ఫుడ్ కోర్టును కాంట్రాక్ట్‌కు మెప్మా ఇచ్చింది. మరోవైపు మాంసాహారం కాంట్రాక్ట్‌పైనా కొందరు అధికార పార్టీ నాయకుల చూపు పడింది. విధాన నిర్ణయం తర్వాత దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం.

డిసెంబరులో బాలోత్సవం

భీమవరం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):భీమవరంలో డిసెంబరు 11, 12 తేదీల్లో బాలోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. శనివారం బాలోత్సవ కమిటీ సమావేశం భీమవరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు విద్యార్థులు ఎక్కువ మంది హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. కమిటీ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.పట్టాభిరామయ్య, అమరావతి బాలోత్సవం నిర్వాహకులు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఆట పాటలు, వ్యాయామం, తగ్గిపోతున్న ఈ తరుణంలో ఈ ఉత్సవాలు పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.

మహిళ అదృశ్యం కేసు విచారణ ఇలాగేనా?

- దర్యాప్తును ముగింపునకు తీసుకురండి
- పశ్చిమ ఎస్పీకి హైకోర్టు సూచన
- విచారణ 4 వారాలకు వాయిదా



అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మంగాదేవి అనే మహిళ అదృశ్యం విషయంలో నమోదైన కేసును పోలీసులు దర్యాప్తు చేసిన తీరును హైకోర్టు తప్పుపట్టింది. తన కుమార్తె అదృశ్యం వెనుక అల్లుడి పాత్ర ఉందని తండ్రి ఫిర్యాదు చేసిన తర్వాత అతడిని ప్రశ్నించడానికి ఐదేళ్లు పట్టిందా అని ప్రశ్నించింది. బ్రహ్మాజీని ప్రశ్నించామని పోలీసులు చెబుతున్నప్పటికీ ఏ తేదీన ప్రశ్నించారో స్పష్టంగా చెప్పడం లేదని పేర్కొంది. మహిళ అదృశ్యం కేసును దర్యాప్తు చేసేది ఇలాగేనా అని ఆక్షేపించింది. కేసు దర్యాప్తులో పోలీసులు అనుసరించిన విధానం పట్ల తాము సంతృప్తిగా లేమని తెలిపింది. కేసు దర్యాప్తును ముగింపు దశకు తీసుకురావాలని ఎస్పీకి సూచించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ శుక్రవా రం ఉత్తర్వులు జారీ చేశారు. తన కుమార్తె మంగాదేవి కనపడడం లేదని జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం గ్రామానికి చెందిన బండారు ప్రకాశరావు 2012 అక్టోబరు 18న తాడేపల్లిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె అదృశ్యం వెనుక అల్లుడు బ్రహ్మాజీ, అతడి కుటుంబ సభ్యుల పాత్ర ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుమార్తె అదృశ్యంపై సీఐడీ, కలెక్టర్, ఎస్పీ, హెచ్ఆర్సీలకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో 2017లో ప్రకాశరావు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం

(మిగతా 8వ పేజీలో)

ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఆత్రేయపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. గౌతమి గోదావరి తీరాన చక్రస్నాన మహోత్సవంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, చైర్మన్ ముదునూరి వెంకట్రాజుతోపాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ధ్వజావహరోణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించారు.

ఆంధ్రజ్యోతి

భీమవరం

భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, నరసాపురం

పడమరవిప్పర్రులో ధన్వంతరి జయంతి

పెంటపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో ఎంతో మందికి చికిత్స అందించిన ధన్వంతరి స్వామి సేవలు మరువ లేనివని నాయీ బాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్నూరి చంద్రశేఖర్ అన్నారు. శనివారం పడమరవిప్పర్రులో ధన్వంతని జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య సేవలు చేస్తున్న రైతు రామకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో పొట్నూరి ఉమాశంకర్, రౌతు వీరయ్య, పొట్నూరి దుర్గారావు, దేవరకొండ సాయి, రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించాలని వినతి

నరసాపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములదీవి తూర్పు గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలని శనివారం వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ప్రజలకు సరఫరా చేసి నీరు కుళాయిల నుంచి మురికినీరు వస్తుందన్నారు. ఈకారణంగా ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీరును ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు అండ



మాట్లాడుతున్న న్యాయ అధికారి లక్ష్మీనారాయణ

భీమవరం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికుల హక్కుల పరిరక్షణకు 2017లో న్యాయ సేవాధికార సంస్థ చట్టం రూపకల్పన చేసిందని మూడవ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు నిర్వహించారు. న్యాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికుల హక్కులకు భంగం కలిగితే వారి సమస్యలు విని సంబంధిత అధికారుల ద్వారా సమస్యల పరిష్కారానికి న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవా సంస్థ అండగా ఉంటాయన్నారు. అవసరమైతే వారి తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ బాలల ప్రయోజనాల కోసం న్యాయ సేవా సంస్థలు కృషి చేస్తున్నాయని అన్నారు. ముందుగా న్యాయమూర్తులను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ (న్యూటన్) సత్కరించారు.

ఉచిత న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి

గణపవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని సీనియర్ జడ్జి కె.మాధవి ప్రారంభించారు. గణపవరం కార్యాలయం వద్ద న్యాయవాది ధనుకొండ సాయికుమార్ ప్రతి శనివారం అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు. ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని సమస్యలు పెద్దవి కాకుండా మొదటిలోనే పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బేబి శ్రీలక్ష్మి, సర్పంచ్ మూరా అలంకారం, గణపవరం సొసైటీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

తణుకు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రిమాండ్ ముద్దాయిలు ఎవరైనా న్యాయవాదులు పెట్టుకునే స్తోమత లేకపోతే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవల సంస్థ సెక్రటరీ కె. రత్న ప్రసాదు తెలిపారు. శనివారం తణుకులోని సబ్ జైలును సందర్శించారు. రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న సౌకర్యాలు, ఆహార, వసతి, వైద్య సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. వారానికి రెండు రోజులు పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీరు వచ్చి న్యాయ సలహాలు ఇస్తారని చెప్పారు.

యూత్‌ఫెస్టివల్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదిత్యా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉద్యోగంతోపాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని ప్రిన్సిపాల్ పి.లక్ష్మిసరోజ పేర్కొన్నారు. జిల్లా యూత్ ఫెస్టివల్‌లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచారని ఆనందం వ్యక్తం చేశారు. స్టోరీ రైటింగ్‌లో ద్వితీయ బహుమతి, వెస్ట్రన్ సోలోలో ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ నల్లిమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి విద్యార్థులను అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట సుబ్బయ్య

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

ముగిసిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన కార్మిక విధానాన్ని నిరసిస్తూ రాష్ట్రంలో పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా పోరాడాలని ఏఐటీయూసి రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు కార్మిక వర్గాలకు పిలుపునిచ్చాయి. రెండురోజులపాటు తాడేపల్లిగూడెంలో జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ రవీంద్రనాథ్, ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్, జే.లలితమ్మ అధ్యక్ష కార్యవర్గంగా ఈ సమావేశాలకు వ్యవహరించారు. ఏఐటీయూసీ ఇటీవల నిర్వహించిన కార్యకలాపాలపై మొదటి రోజు సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకట సుబ్బయ్య ప్రవేశపెట్టిన నివేదికపై రెండురోజుల పాటు చర్చజరిగింది. మొత్తం 26 జిల్లాలోని 47 మంది కార్మిక నేతలు, ప్రతినిధులు మాట్లాడారు. దేశవ్యాప్తంగా నవంబరు 26న నిరసన దినంగా ప్రచార ఆందోళనా కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మానించింది.

తీర్మానాలు ఇవే..

ప్రభుత్వ ఆసుపత్రిలో 50 సంవత్సరాలు నిండిన కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులను తొలగించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యం పీఎఫ్ వంటి బకాయిలు విడుదల చేయాలని ఆందోళన చేపట్టాలని, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెనోటీస్ ఇచ్చినందుకు ప్రభుత్వం స్పందించాలన్నారు. భవన నిర్మాణ కార్మిక వెల్ఫేబోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లైములను పరిష్కరించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ ఆందోళన చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు.

బధిరులకు ఆటల పోటీలు

భీమవరం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పండుగలు మన ఇంటిలో మనం జరుపుకోవడంతోపాటు అభాగ్యులతో జరుపుకోవడం భగవంతుడు మెచ్చే కార్యక్రమమని క్రీడా అసోసియేషన్ సభ్యులు పెన్మెత్స శ్రీధర్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర బధిర పాఠశాలలో దీపావళి పురస్కరించుకుని బధిరులకు ఆటల పోటీలు నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.తిరుపతిరావు మాట్లాడుతూ 25 ఏళ్లుగా అన్ని పండుగలు సాంప్రదాయ బద్ధంగా బాలలతో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి సహకారంతో నిర్వహిస్తున్నామని అన్నారు. నిర్వాహకులు రంగసాయి మాట్లాడుతూ దీపావళి సందర్భంగా 100 మంది చిన్నారులకు దాతల సహకారంతో స్వీట్స్ పంపిణీ చేశామని అన్నారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

అత్తిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పైడయ్య అన్నారు. ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు గెడ్డం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు.

మహిళ అదృశ్యం కేసు విచారణ ఇలాగేనా?

(7వ పేజీ తరువాయి)

ఇటీవల విచారణకు రాగా కేసు దర్యాప్తు పురోగతిపై ఎస్పీ దాఖలు చేసిన అఫిడవిట్‌న అసమగ్రంగా ఉందని, ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు నేరుగా కోర్టు ముందు హాజరుకావాలని జిల్లా ఎస్పీ, కొవ్వూరు డీఎస్పీ, తాడేపల్లిగూడెం ఎస్‌హెచ్‌వోను కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. శుక్రవారం వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు వారు కోర్టు ముందు హాజరయ్యారు.







ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల.. భీమవరంలో టెన్నిస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు.. తాడేపల్లిగూడెం ఆర్ఎంపీల సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. చిత్రంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ఇష్టపడి చదవాలి: మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):విద్యార్థి దశలో కష్టమైనప్పటికీ ఇష్టపడి చదివితే ఉన్నత స్థానాలు లభిస్తాయని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా 2025-26లో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు స్వాగతం పలికి ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీడీసీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బీవీ రాఘవయ్య, రంగారావు, కారుమూరి రామలింగేశ్వర రావు, త్రినాధ్, శివరావు, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొలిశెట్టి వితరణ

తాడేపల్లిగూడెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):బ్రాహ్మణ పురోహిత కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.1,01,116 విరాళాన్ని శనివారం సంఘం నాయకులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజికవర్గాలకు అందరికి ప్రయోజనంగా ఉండే ఏ కార్యక్రమానికైనా తన వంతు సహకారం అదిస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో విశ్వనాధశర్మ, సబ్నీవీసు కృష్ణమోహన్, సోమాసి సూర్యనారాయణ శర్మ, ప్రయోగ కిషోర్‌శర్మ ఉన్నారు.

ఓపెన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

భీమవరం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం టౌన్ హాల్లో శనివారం 9 రోజులపాటు జరిగే భీమవరం ఓపెన్ సీజన్-3 టెన్నిస్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కోళ్ల రామ చంద్రరావు, బేతు కృష్ణారావు, టెన్నిస్ ఆర్గనైజర్ కొప్పర్తి రవిబాబు మాట్లాడుతూ 9 రోజులపాటు మూడు క్లబ్‌లలో 88 మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు.

గ్రామీణ వైద్యులే నిజమైన ప్రజా సేవకులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో బేసిక్ లైఫ్ సపోర్ట్‌తో ప్రజల ప్రాణాలను కాపాడే గ్రామీణ వైద్యులే నిజమైన ప్రజా వైద్యులని మాజీ ఎమ్మెల్సీ, పీఎంపీ ఆర్ఎంపీ జాయింట్ యాక్షన్ కమిటి గౌరవ అధ్యక్షులు టీడీ జనార్దన్, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పీఎంపీ ఆర్ఎంపీ జాయింట్ యాక్షన్ కమిటి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఇంకులు కన్వెన్షన్ హాలులో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంపీ, ఆర్ఎంపీల సమస్యలపై చర్చించారు. ముందుగా ధన్వంతరి జయంతి సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పీఎంపీ ఆర్ఎంపీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యేలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

ఉండి మండల సమాఖ్యకు రుణాలు

ఉండి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నుంచి ఉండి మండల మహిళా సమాఖ్యకు రూ.51.75కోట్లు రుణాలు విడుదలైనట్లు సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి తెలిపారు. శనివారం భీమవరంలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో తమకు చెక్కును అందించారని తెలిపారు. మండలంలో 5906మంది స్వయంసహాయక సభ్యులకు గాను ఈరుణాలు మంజూరు అయ్యాయని తెలిపారు.

కేంద్ర పథకాలపై అవగాహన ఉండాలి

తణుకు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై రైతులు అవగాహన కలిగి వుండాలని భారతీయ కిసాన్ సంఘ్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా మంత్రి దోసూరి రాము అన్నారు. శనివారం దువ్వ గ్రామంలో కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొంటా సత్యనారాయణ అధ్యక్షతన రైతులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో రైతుల సమస్యలపై అవగాహన కల్పించడం, మూల సంకల్పం, గ్రామ సమితి విధులు, గురించి రైతులకు వివరించారు. రాష్ట్ర అధ్యక్షులు సహదేవ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కావూరి పతి రాజు, పైడికొండల శివాజీ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పాఠశాలల్లో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సర్వశిక్షాభియాన్ ఏఎస్‌వో ముదునూరి నారాయణ రాజు అన్నారు. క్లస్టర్ పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా నారాయణ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరు నూరుశాతం ఉండాలన్నారు. విద్యార్థుల ఆధార్ క్రమబద్ధీకరణ, ఎస్ఏవన్ సిలబస్ పూర్తి చేయించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్ చైర్మన్ ఎస్.జాన్సీ లక్ష్మీబాయి, కార్యదర్శి ఆర్ భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భీమవరం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 12వ తేదీన పట్టణంలోని గునుపూడిలో నిర్వహించిన పెళ్ళి విందులో కటికల సునీల్‌కుమార్ (25) ప్రమాదవశాత్తు వేడిగా ఉన్న సాంబారు గిన్నెలో పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చనిపోయాడని మృతుని భార్య నీలిమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ చక్రవర్తి తెలిపారు.



సర్టిఫికెట్లు అందుకున్న ఆక్వా విద్యార్థులు

రొయ్యల సాగులో మేతపై అవగాహన ఉండాలి

ఉండి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):రొయ్యలసాగులో మేత నిలువ పద్ధతులు, మేతలు అందించు మోతాదులపై అవగాహన ఉండాలని విజయవాడ సీఐఎఫ్ఏ-శాస్త్రవేత్త డా.రమేష్ రాథోడ్ అన్నారు. శనివారం మత్స్యపరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్న ఆక్వా విద్యార్థుల మూడు రోజుల శిక్షణ తరగతులు ముగిశాయి. డా.రమేష్ రాథోడ్ మాట్లాడుతూ రొయ్యల సాగులో మేతల తయారీ, మేత యాజమాన్యం ప్రముఖమైనదన్నారు. రొయ్యల సాగులో మేతల యాజమాన్యంలో చెక్ ట్రే పద్ధతి విధానం దశలవారీగా అందించు మేతలు మొదలగు వాటిపై అవగాహన ఎంతో అవసరమన్నారు. కేవీకే ఫిషరీస్ శాస్త్రవేత్త డా.ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఎన్నో సబ్సిడీలను ఆక్వా రైతులు, విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. మత్స్యపరిశోధన కేంద్రం హెడ్ డా.చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ రొయ్యలు, చేపల లార్వా దశలో సరైన పోషణ జీవనశక్తి వృద్ధి శారీరక మార్పులకు కీలమన్నారు. కార్యక్రమంలో మత్స్యపరిశోధన కేంద్రానికి చెందిన భీమేశ్వరరావు, శివకుమార్, ధీరజ్, షష్టి రిషలతో పాటు భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల లెక్చరర్స్ పాల్గొన్నారు. అనంతరం ఆక్వా విద్యార్థులు శిక్షణ తరగతుల సర్టిఫికెట్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా కేజీఆర్ఎల్ కళాశాలకు చెందిన కె.శ్రీరాజ్యలక్ష్మి మాట్లాడుతూ రొయ్యల సాగులో మెళకువులపై ఇచ్చిన శిక్షణ తరగతులు తమకు ఎంతగానో అవగాహన అయ్యాయని అన్నారు. ఇటువంటి శిక్షణ తరగతులు ప్రతి ఏటా నిర్వహించాలని కోరారు. ఆక్వా విద్యార్థులకు కళాశాలలో ఇచ్చే తరగతులతో పాటు శాస్త్రవేత్తలతో ఇటువంటి కార్యక్రమాలు అందించడం తమకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

కాళ్లలో 14 దుకాణాలకు అనుమతి

కాళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా కాళ్ళ మండలంలో 21 గ్రామాల్లో మొత్తం 14 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ జి.సుందర్‌సింగ్ తెలిపారు. ఏలూరుపాడులో 4, కాళ్లలో 2, కాళ్ళకూరు 1, పెద అమిరం 3, సీసలి 2, జువ్వలపాలెం 1, బొండాడ 1 చొప్పున బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు వచ్చినట్లు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

తణుకు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్కేఎస్‌డీ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు అన్నారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏడుకొండలు మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి మొక్కలు నాటడం, వాహన వినియోగం తగ్గించడం, వ్యర్థాలను తగలబెట్టకపోవడం వంటి చిన్న చర్యలతో పెద్ద మార్పు తీసుకురాగలమని చెప్పారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.నారాయణ, డా. కె.నాగభూషణ రెడ్డి, రెడ్ క్రాసు మేనేజర్ జె.సూర్య మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు క్లీన్ ఎయిర్ క్లైమేట్ యాక్షన్ ప్రతిజ్ఞ చేశారు.

డ్వాక్రా సమావేశంలో కొట్లాట

నరసాపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామంలో శుక్రవారం రాత్రి స్త్రీ నిధికి సంబంధించిన అవకతవకలపై డ్వాక్రా సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. వెలుగు అధికారులు నిధుల అవకతవకాలపై సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఆదే సమయంలో గ్రామానికి చెందిన కొంత మంది సమావేశంలోనికి వచ్చి గందరగోళం చేశారు. ఒకరికొకరు తోసుకుని కొట్లాటకు దిగారు. దీంతో సమావేశానికి విచ్చేసిన మహిళలు భయందోళన చెందారు. అరుపులు, కేకలు వేశారు. విచారణ నిమిత్తం విచ్చేసిన అధికారులు సమావేశం వివరాలు సేకరించకుండానే అర్ధంతరంగా ముగించాల్సి వచ్చినట్లు ఐకేపీ మేనేజర్ నాగభూషణం నాయుడు తెలిపారు.

నిరుపేదలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు

నరసాపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా అందించే గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్, పొయ్యిలను అందించారు. అర్హులైన లబ్ధిదారులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ రాఘవులుకు ఘన నివాళి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సి.రాఘవులు మృతదేహానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం మృతి చెందిన రాఘవులు చిరస్మరణీయుడని కాంగ్రెస్ నాయకులు అన్నారు. నివాళులు అర్పించిన వారిలో డాక్టర్ నైనామగిరి, మోహనరావు, గోపాల రావు, ప్రభుదాసు, షేక్ మహబూబ్ జానీ, యడ్ల శివాజీ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

గణపవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గణపవరం జల్లికాకినాడ మంచినీటి చెరువులో తూడు, నాచుతో నిండి తాగునీటికి ఇబ్బందికరంగా మారింది. ఈ మేరకు గ్రామంలోని పలువురు జిల్లా పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులు సరిహద్దు గ్రామమైన కేశవరం వాటర్ ప్లాంట్‌కు వెళ్లి సొమ్ములు చెల్లించి మంచినీటి టిన్నులు తెచ్చుకుంటున్నారని తెలిపారు. చెరువులోని వ్యర్థాలుతొలగించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరగవరం పీహెచ్‌సీ తనిఖీ

ఇరగవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి సూచించారు. ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గీతాబాయి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసరాలను పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య సేవా కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖాన్ సాహెబ్, యూడీసీ శ్రీనివాస్, పీహెచ్ఎన్ రాణి, సూపర్‌వైజర్ మూర్తి పాల్గొన్నారు.

క్రీడల్లో వేల్పూరు పాఠశాల విద్యార్థుల ప్రతిభ

తణుకు రూరల్, 18 (ఆంధ్రజ్యోతి):ఇటీవల జరిగిన నరసాపురం డివిజన్ స్థాయి అండర్ 17 బాల, బాలికల ఆటల పోటీలలో వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు విభాగాలలో విజేతలుగా నిలిచి బహుమతులు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం డాక్టర్ జి.రాధాకృష్ణ తెలిపారు. విజేతలుగా నిలిచిన సీహెచ్ దేవదాస్, కేఎస్ వీవీ సాత్విక్, పి.సాహితీ ప్రియదర్శిని, ఎంఎస్వీ ప్రసాద్, వి. మోక్షానంద స్వరూప్, సీహెచ్ తులసీ, ఆర్.గీతాశ్రీ, డాల్లీలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సోమేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో శనివారంనాడు హుండీల ఆదాయం లెక్కించారు. 7లక్షల 32వేల 135 రూపాయలు ఆదాయగా వచ్చిందని ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. నగదుతోపాటు మూడు విదేశీ నోట్లు, అన్నదానం హుండీ ద్వారా 7వేల 936 రూపాయలు వచ్చాయని తెలిపారు.

భాష్యంలో దీపావళి వేడుకలు

పెనుగొండ, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):పెనుగొండ భాష్యం పాఠశాలలో దీపావళి వేడుకలు శనివారం నిర్వహించారు. టపాసులు కాల్చడం ద్వారా వాతావరణంలో ఉండే బ్యాక్టీరియాని పారదోలడం అని, చెడుపై విజయాన్ని పొందడమనని ప్రిన్సిపాల్ ఎస్. వెంకట అప్పారావు అన్నారు. విద్యార్థులు టపాసులు కాల్చారు. కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, చాంప్స్ ఇన్‌చార్జి రాణీ రోజాజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకు ఎండుతెగులు తగ్గుముఖం

ఉండి/పెంటపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆకు ఎండుతెగులు వ్యాప్తి కూడా తగ్గిందని మార్టేరు ప్రధాన శాస్త్రవేత్తలు డా.గిరిజారాణి, డా.భువనేశ్వరి(తెగుళ్లశాస్త్రం), శాస్త్రవేత్త డా.రమేష్‌బాబు, ఉండి కేవీకే ప్రోగ్రాం హెడ్ డా.మల్లికార్జునరావు, డా.పి.వినయలక్ష్మి తెలిపారు. శాస్త్రవేత్తలు బృందం శనివారం పెనుమంట్ర, పెంటపాడు మండలాల్లో వరిపొలాలను పరిశీలించారు. ఆకు ఎండుతెగులు ఉధృతి ఎక్కువగా వున్న రైతులు ఎకరాకు 400గ్రాములు కాపర్ హైడ్రాక్సైడ్‌తో పాటు 200గ్రాములు ప్లాంటోమైసిన్‌ను పిచికారి చేసుకుని నత్రజని ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యం

జిల్లా అంతటా స్వచ్ఛ ఆంధ్రా ర్యాలీలు



కొవ్వాడ అన్నవరంలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి

భీమవరం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచినప్పుడే ఆరోగ్యంగా ఉంటామని డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం కొవ్వాడ అన్నవరం గ్రామంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ చెట్లు నాటడం ద్వారా స్వచ్ఛమైన గాలిని పొందగలుగుతామన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చెత్త రహదారుల పక్కన వేయనప్పుడే పరిశుభ్రమైన వాతావరణం గ్రామంలో నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, కార్యదర్శి శ్యామ్, అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్:ప్రజల జీవన విధానం మార్పు చేసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధించాలనే సంకల్పంతోనే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్టు ఇన్‌చార్జ్ డీఎల్‌డీవో జీవీకే మల్లికార్జునరావు పేర్కొన్నారు. పెదతాడేపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సైకిల్స్ ర్యాలీలో ఎంపీడీవో వి.చంద్రశేఖర్, కార్యదర్శి టి.రవిచంద్ర పాల్గొన్నారు. మండలంలోని అప్పారావుపేటలో సర్పంచ్ ఆరుగొల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటి పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

మొగల్తూరు:పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ సూచించారు. శనివారం లక్ష్మీహరిప్రియ గ్యాస్ ఏజెన్సీ వద్ద కట్టెలపొయ్యి వద్దు గ్యాస్ పొయ్యిలు వినియోగిద్దామంటూ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అలాగే సోలార్ విద్యుత్ ఏజెన్సీ వద్ద సోలార్ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీటీ సుగుణ సంధ్య, ఆర్ఐ రూజ్‌వెల్ట్, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వర రావు పాల్గొన్నారు.

ఇరగవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేక అధికారి వి.నాగరాజు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం సైకిల్‌పై ర్యాలీ చేపట్టి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆచంట:చెత్త, వ్యవసాయ వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బి. కృష్ణమోహన్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ పృథ్వీ, కేతా మీరయ్య, సొసైటీ చైర్మన్ కడలి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పరిసరాలు శుభ్రం చేశారు. అనంతరం గ్యాస్ వినియోగంపై డ్వాక్రా, రేషన్ డీలర్లు మేళా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫరూఖ్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు బేఖాతర్ !

దీపావళి పండుగ అంటే అందరూ ఎంతో ఆనందంగా నిర్వహించుకునేందుకు ఎదురు చూస్తుంటారు. చిన్న పిల్లలైతే 15 రోజుల ముందు నుంచే పలు దుకాణాల వద్ద లభించే తుపాకీ బిళ్లలు, పాము బిళ్లలు, అగ్గిపెట్టెలు వంటి వాటిని కాల్చుతూ సంతోషిస్తారు. మరోవైపు ముందస్తు జాగ్రత్తల నేపథ్యంలో ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలను వ్యాపారులు బేఖాతర్ చేస్తున్నారు. అక్కడక్కడా అధికారులు తనిఖీలు చేస్తున్నప్పటికీ అధికారుల పూర్తి నిఘా వైఫల్యంతో మరిన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

- ఉమ్మడి పశ్చిమ జిల్లాలో బాణసంచా వ్యాపారుల నిర్వాకం
- శివకాశీ నుంచి బాణసంచా లారీల రాక..
- ఏలూరు సమీపంలో రహదారులపైనే పార్కింగ్
- బిల్లులు లేకుండా అక్రమ మార్గంలో రవాణా
- జనవాసాల మధ్యలోనే బాణసంచా తయారీ
- నిఘా వైఫల్యం.. పొంచి ఉన్న ప్రమాదాలు

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా భద్రత నిమిత్తం దీపావళి షాపుల ఏర్పాటుకు ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇస్తుంది. కొన్ని తయారీ కేంద్రాలు, కొన్ని నిల్వ కేంద్రాలకు అనుమతులు అందిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో శాశ్వత బాణసంచా నిల్వలు, విక్రయాలకు సంబంధించి 15 షాపులు, పశ్చిమ గోదావరి జిల్లాలో 40 షాపులకు అనుమతులు ఉన్నాయి. వీరు పలు తారాజువ్వలు, మందుగుండు సామగ్రి విక్రయించుకోవడానికి అనుమతులు ఉన్నాయి. వీరికి 50 కేజీల నిల్వ నుంచి 500 కేజీల వరకు సాధారణంగా అనుమతులు తీసుకుంటారు. కానీ వారి వద్ద వేల కేజీల్లోనే నిల్వలు ఉంచుతారు. వీరు తీసుకునే అనుమ తులు 50 కేజీల వరకు అనుమతి అని చెబుతారు.. కానీ విక్రయించేది వేల కేజీల్లోనే ఉంటుంది.

శివకాశీ నుంచి సరుకు దిగుమతి..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో షాపుల నిర్వాహకులు తమిళనాడులోని శివకాశీ నుంచి నేరుగా అక్కడ వ్యాపారులతో ముందుగానే ఒప్పందాలు చేసుకుని లారీ లోళ్లను తమ షాపులో ఉన్న సమీప ప్రాంతాలకు తీసుకువచ్చి జాతీయ రహదారిలోనూ, సర్వీసు రోడ్డుల్లోనూ లేదా మరే ఇతర రోడ్లలో ఆ లారీలను పార్కు చేయించి ఉంచుతున్నారు. షాపులో సరుకులు అయిపోగానే ఆ లారీని సమీపానికి తీసుకువచ్చి మళ్లీ దిగుమతులు చేస్తున్నారు. వాస్తవానికి వారు తీసుకువచ్చే మందుగుండు సామగ్రికి వాణిజ్య పన్నుల శాఖాధికారులు తనిఖీలు చేయాల్సి ఉన్నా ఆ శాఖ అధికారులు

అనుమతులు తక్కువ.. నిల్వలు ఎక్కువ

తనిఖీలు చేసిన దాఖలాలు కానరాలేదు. శివకాశీ నుంచి ఏలూరు జిల్లాకు 350 లారీల సరుకు, పశ్చిమ గోదావరి జిల్లాకు 500 లారీలు, తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం ప్రాంతాలకు 150 లారీలకుపైగా సరుకు వస్తున్నట్లుగా అక్కడ వ్యాపారులు చెబుతున్నారంటే ఇక్కడ కనిపించేది కేవలం కొద్ది సరుకు విక్రయించిన వెంటనే మళ్లీ సరుకు తీసుకువచ్చి పెడుతూ ఉంటారు.

పెద్దఎత్తున విక్రయ కేంద్రాలు..

బాణసంచా విక్రయ కేంద్రాలు పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటుకు రెవెన్యూ, పోలీసు, ఫైర్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇస్తుంటారు. జనవాసాల మధ్య వీటిని ఏర్పాటు చేయకూడదని, గతంలో జరిగిన ప్రమాదాల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆ దిశగా షాపులను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఏలూరులోని ఒక షాపు నిర్వాహకుడు ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా సామగ్రి నిల్వ చేసి చిన్న చిన్న కిరణా షాపుల వారికి కిరాణా సరుకుల్లా విక్రయించాడు. అతడి వద్ద నుంచి ఉల్లిపాయల బాణసంచాను బస్తాలో వేసుకుని స్కూటర్ మధ్యలో పెట్టుకుని వెళ్తుండగా ప్రమాదం జరిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఏడుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై ఎలాంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించిన వ్యక్తిపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

బిల్లులు లేకుండా బాణసంచా నిల్వలు !

పండుగ రోజు విక్రయాలు చేసేందుకు చిల్లర వర్తకులు, హోల్‌సేల్ వ్యాపారుల నుంచి బాణ సంచా కొనుగోలు చేస్తుంటారు. ఇప్పటికే భారీ ఎత్తున బాణసంచా నిల్వలు పెట్టారు. వీటికి ఎలాంటి బిల్లులు ఉండడంలేదని తెలుస్తోంది. జిల్లాలో విస్తృతగా తనిఖీలు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు, రెవెన్యూ, ఫైర్, పోలీస్ శాఖలను ఆదేశించారు. వారి ఆదేశాలతో జిల్లాలో అక్కడక్కడ ఈ బాణసంచా సామగ్రి నిల్వలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఏలూరు, పరిసర గ్రామాల్లో అక్రమ మందుగుండు సామగ్రిని గుర్తించి పోలీసులు సంబంధిత వ్యక్తులను అరెస్టు చేశారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సత్రంపాడులోని ఎంఆర్‌సీ కాలనీలో ఇద్దరు వ్యక్తులు అత్యంత ప్రమాదకరమైన నార బాంబులను తయారు చేస్తున్నారు. జనవాసాల మధ్య వీటిని తయారు చేయడంతో పట్టుకున్న పోలీసులే అవాక్కయ్యారు.

బాణసంచా అక్రమ నిల్వలు.. ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం : జన నివాసాల మధ్య బాణసంచా అక్రమంగా నిల్వలు ఉంచిన ముగ్గురు యువకులను ఏలూరు టూటౌన్ సీఐ కె. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ శనివారం అరెస్టు చేశారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని గానుగులపేట విమలాదేవి స్కూల్ సమీపంలో బోర్ల లక్ష్మి అనే మహిళ ఇంట్లో కె.కనకరాజు, గంగ, యశ్వంత్ కలిసి తాడేపల్లిగూడెంలో రూ.40 వేల విలువైన బాణసంచా సామగ్రి కొనుగోలు చేసుకుని బూర్ల లక్ష్మి ఇంట్లో దాచి విక్రయించడానికి సిద్ధమయ్యారు. ఈ సమాచారం అందడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు శనివారం రాత్రి ఆ ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ సెన్సార్‌తో వెలిగే ప్రమిదలు


నీటితో వెలిగే సెన్సార్ దియా, వాటర్ లెడ్ ప్రమిదలు

తణుకు రూరల్ : దీపావళికి ప్రధాన ఆకర్షణగా నిలిచేవి దీపాలు. ఇప్పటివరకు ప్రమిదలలో నూనె పోసి వాటిలో ఒత్తులు వేసి వెలిగించే వారు. ఈ ప్రమిదలు కూడా అనేక రకాల కలర్స్‌లో వచ్చాయి. నూనె, ఒత్తులు అవసరం లేని ప్రమిదలు అందుబాటులోకి వచ్చాయి. ఫైబర్ ప్రమిదల్లా వుండే ప్రమిదలకు ఒక ఎలక్ట్రానిక్ బల్బు ఏర్పాటు చేసి దాని కింద భాగంగా చిన్న బ్యాటరీని అమర్చారు. దానికి రెండు చివరలు ఏర్పాటు చేసి వాటికి నీరు తగిలే ఏర్పాటు చేయడంతో నీరు పోయగానే విద్యుత్ కొనలకు ఎర్త్ జరిగి ప్రమిదల చివరన ఏర్పాటు చేసిన బల్బు వెలుగుతుంది. న్యూఢిల్లీకి చెందిన సెన్సార్ దియా, వాటర్ లెడ్ పేరుతో రూపొందించిన ఈ సెన్సార్ ప్రమిదలు దీపావళి బాణ సంచా దుకాణాల వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటితో వర్షంలో దీపం ఆరిపోవడం గానీ, ఈదురు గాలులకు ఆరిపోవడం గానీ జరగదు. చిన్న పిల్లలకు కాలుతుందని, షాక్ కొడుతుందనే భయం లేదు. ఒక్కో బాక్సు రూ.100 కాగా, ఒక్కో బాక్సులో ఆరు ప్రమిదలు వున్నాయి. ఇవి సుమారు 72 గంటల పాటు ఏకధాటిగా పనిచేస్తాయని విక్రేత సంకు ఏసుబాబు తెలిపారు. గత ఏడాది నుంచి వీటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు.


తణుకు-దువ్వ హైవేపై బాణసంచా కొనుగోలుకు బారులు తీరిన వాహనాలు.. షాపుల్లో అమ్మకాలు

దువ్వలో ముమ్మరంగా బాణసంచా అమ్మకాలు

తణుకు రూరల్: తణుకు మండలం దువ్వ హైవే పక్కన బాణసంచా అమ్మకాలు ముమ్మరంగా సాగుతున్నాయి. హైవే పక్కన శాశ్వత ప్రాతిపదికన షాపులు ఏరాపటు చేయడంతో బాణసంచా అమ్మకాలతో రద్దీ పెరిగింది. ప్రతి ఏడాది దీపావళికి రెండు రోజులపాటు తాత్కాలిక లైసెన్స్‌లతో నిర్వహించే బాణసంచా షాపులను ఈ ఏడాది తణుకు జాతీయ రహదారి పక్కన పైడిపర్రులో ఏర్పాటు చేయడంతో పట్టణంలో రద్దీ తగ్గింది. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాయి. తణుకు పట్టణంలో గత ఏడాది కంటే తాత్కాలిక షాపుల ధర పెరగడంతో మొత్తం షాపులు తగ్గాయి. గతంలో సుమారు 50 షాపులు ఉండేవి. ప్రస్తుతం 40 షాపులకే పరిమితమయ్యాయి. గతంలో ఒక్కో షాపునకు రూ.15వేలు వసూలు చేయగా ప్రస్తుతం రూ.35 వేలకు పెరిగిందని వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావడంతో అమ్మకాలపై ప్రభావం పడుతుందని వ్యాపారుల్లో ఒకింత భయం నెలకొంది.


శ్రీవారి దర్శనానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచిఉన్న భక్తులు

మార్మోగిన గోవింద నామస్మరణ

ద్వారకాతిరుమల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణతో చిన్న తిరుమలేశుని క్షేత్రం మార్మోగింది. అమావాస్య ముందురోజులు కావడంతో భక్తుల రద్దీ కాస్త తగ్గినా వేలాది మంది ఆలయానికి శనివారం విచ్చేశారు. స్వామికి ఇష్టమైన రోజు కావడం వల్ల భక్తుల రాకతో ఆలయం కళకళలాడింది. ఆలయానికి దాదాపు 15వేల మంది వరకు భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.

జేఎన్వీలో 9,11 తరగతుల ఖాళీల భర్తీకి గడువు పెంపు

పెదవేగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల తేదీని ఈనెల 23వ తేదీ వరకు పొడిగించామని ప్రిన్సిపాల్ పరశురామయ్య తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు 9వ తరగతికి సంబంధించి https://cbseitms.nic.in/2025/nvsix వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. 11వ తరగతికి దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు https://cbseitms.nic.in/2025/nvsxi వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మార్పులు, చేర్పులకు ఈనెల 24 నుంచి 26 వరకు అవకాశం కల్పించామన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గోపన్నపాలెంలో ఈనెల 17వ తేదీన జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ఐదుగురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పెదపాడు మండలం వీరమ్మకుంట పాఠశాల హెచ్.ఎం. రామ్‌ప్రసాద్ తెలిపారు. టి.సిద్ధు (వాలీబాల్), ఎం.వినీల్ (కబడ్డీ), ఎం.గణేష్, గిరిహనుమాన్ (కబడ్డీ), బాలికల విభాగంలో వి.లాస్య (కబడ్డీ) ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాలలో శనివారం ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాలకొల్లులో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏఎంసీ చైర్మన్, సభ్యులతో మంత్రులు, ముఖ్య అతిథులు.. ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ దంపతులకు సత్కారం

మార్కెట్ కమిటీల స్వయం ప్రతిపత్తికి ఆదేశాలిచ్చాం

- మంత్రి అచ్చెన్నాయుడు
- ఏఎంసీ చైర్మన్‌గా విజయ భాస్కర్, వైస్ చైర్మన్‌గా రత్నంరాజు ప్రమాణ స్వీకారం

పాలకొల్లు అర్బన్/పోడూరు/పాలకొల్లు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలు సెస్ ద్వారా వచ్చే ఆదాయంపై పాలక వర్గాలే నిర్ణయం తీసుకోవడంతో పాటు స్వయం ప్రతిపత్తి కలిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో శనివారం స్థానిక మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అధ్యక్షతన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు. ఏఎంసీ చైర్మన్‌గా కోడి విజయభాస్కర్, వైస్ చైర్మన్‌గా మాతా రత్నంరాజు, పాలకవర్గ సభ్యుల చేత మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో పరిపాలన కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. సభలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, పీతల సుజాత, కుడిపూడి సత్తిబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, వలవల బాబ్జి, పొత్తూరి రామరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గాంధీ భగవాన్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఉన్నమట్ల కపర్ది, వై.పద్మారావు, దేవళ్ల ప్రసాద్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, పీతల శ్రీను, తులా రామలింగం తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా అతిథులను పాలకవర్గం ఘనంగా సత్కరించింది. పాలక వర్గ చైర్మన్ కోడి విజయభాస్కరరావు, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి దంపతులను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. తొలుత స్థానిక మంత్రి కార్యాలయం వద్ద నుంచి భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి, పూలపల్లి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి అనంతరం మార్కెట్ కమిటీ ప్రాంగణానికి చేరుకున్నారు. మంత్రి నిమ్మల బైక్‌పై కోడి విజయభాస్కర్ కూర్చుని రాగా, అచ్చెన్నాయుడు బైక్ నడుపుతూ వచ్చారు. కార్యక్రమంలో మహ్మద్‌జా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గానికి ప్రముఖుల అభినందనలు

పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోడి విజయభాస్కర్, వైస్ చైర్మన్‌గా దాసరి రత్నరాజు, పాలకవర్గ సభ్యులను రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాస్‌లతో పాటు మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు అభినందనలు తెలిపారు.


వైద్యురాలిని సత్కరిస్తున్న ఆరిమిల్లి.. కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

తణుకు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం తణుకు వీకే కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి రూ25 లక్షల బీమా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిం చిందన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న వారికి సీఎం సహాయనిధి నుంచి నిధులు కేటాయిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

రెండు వేల మందికి ఉచిత వైద్య పరీక్షలు

మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి తణుకు నియోజకవర్గం నుంచి విశేష స్పందన లభించింది. సుమారు రెండు వేల మంది ప్రజలు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి విచ్చేశారు. నిడదవోలు రాజరాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటి ఆసుపత్రి, అలంపురం ట్రస్టు ఆసుపత్రి, ఏలూరు ఆశ్రం ఆసుపత్రి నుంచి వైద్యులు వీణ, మహాలక్ష్మి, స్మృతి, రేఖాకీర్తి, సౌజన్య, చందన ప్రియాంక, రషీద్, హుస్సేన్, ఆదిత్య రెడ్డి, లక్ష్మీసరోజ, ఝాన్సీరాణితో పాటు సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులను సత్కరించారు. మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లో కొత్త వెలుగు

కేంద్ర, రాష్ట్రాల్లో ప్రజల కోసం పని చేసే ప్రభుత్వాలు : మంత్రి

- 'గూగుల్' రాకతో 2 లక్షల మందికి ఉపాధి : మంత్రి సుభాష్
- కూటమి హయాంలోనే హార్బర్ నిర్మాణం : విప్ నాయకర్


పడవల ర్యాలీ.. (ఇన్‌సెట్‌లో) ర్యాలీని ప్రారంభించిన మంత్రి వర్మ

నరసాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):'జీఎస్టీ తగ్గింపుతో ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపనున్నాయి, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని అమలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. రెండు చోట్లా పని చేసే ప్రభుత్వాలే ఉండడం వల్ల అభివృద్ధి, సంక్షేమం వైపు దూసుకుపోతున్నాయని' కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్, విప్ నాయకర్ అన్నారు. శనివా రం నరసాపురంలో 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా పడవలతో వశిష్ఠ గోదావరిలో విన్నూతంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వలందర్ రేవు నుంచి రాజుల్లంక వరకు సుమారు వంద పడవలతో సాగిన ర్యాలీలో మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి వర్మ మాట్లాడుతూ నరసాపురం- చెన్నై మధ్య ప్రతిపాదించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ త్వరలో పట్టాలపైకి వస్తుందని, రైల్వే బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ గూగుల్ సంస్థ రాకతో రాష్ట్రంలో రెండు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించనుందన్నారు. విప్ నాయకర్ మాట్లాడుతూ బియ్యపుతిప్ప హార్బర్ నిర్మాణం కూటమి హయాంలోనే జరుగుతుందన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20 వేలకు పెంచిన ఘనత కూటమికే దక్కిందన్నారు. నియోజక వర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదలతో వలల ధరలు రూ.80వేలు, ఇంజన్ ధరలు రూ.20వేల వరకు తగ్గనున్నాయన్నారు. అనంతరం రెండు మత్స్యకార సొసైటీలకు ప్రధానమంత్రి మత్స్యకార యోజన కింద రూ.10 లక్షల చెక్కును అందించారు. ఆర్డీవో దాసిరాజు, మైలా వసంతరావు, కబర్ధి, చాగంటి చిన్న, జక్కం శ్రీమన్నారాయణ, పోలిశెట్టి శ్రీనివాస్, పీవీఆర్, కమిషనర్ అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

క్రైం సమాచారం

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్‌లో ఒక గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ శివన్నారాయణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు ఏలూరు కొత్తూరు రోడ్డులోని క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో పోలీస్ కాలనీలో నివాసం ఉంటున్న సుంకర జగ్గారావు(75)గా గుర్తించారు. అనారోగ్యంతో అతడు మరణించి ఉంటాడని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పొలంలో పురుగుల మందు కొట్టి.. అస్వస్థతకు గురై యువకుడి మృతి

ఏలూరు క్రైం : పొలంలో పురుగు మందు కొట్టిన ఒక యువకుడు ఆ ఘాటుకు తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన పసుమర్తి లక్ష్మణరావు(33) శనివారం పొలంలో పురుగుల మందు కొట్టడానికి వెళ్లాడు. ఆ ఘాటుకు తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి శనివారం సాయంత్రం తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

'బ్యాంక్ ఆఫ్ బరోడా'లో మంటలు


దగ్ధమైన విద్యుత్ మీటరు

ఏలూరు క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూ రు అమీనాపేట బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. లోపల నుంచి పొగ, మంటలు వ్యాపించడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి రామకృష్ణ తమ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేశారు. బ్యాంకులో ఉన్న విద్యుత్ మీటరు వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించాయని, సత్వరమే అదుపు చేయడంతో ఇబ్బంది లేదని అధికారులు తెలిపారు.

బోల్తా పడిన పండ్ల వ్యాన్


తిరగబడిన సీతాఫలాల లోడు వ్యాన్

జీలుగుమిల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి పక్కపక్కనే వెళుతున్న రెండు లారీలు ఢీకొన్న సంఘటన జరిగింది. మహారాష్ట్ర నుంచి సీతాఫలాలు, దానిమ్మ పండ్ల లోడుతో ఐషర్ వ్యాన్ కోల్‌కతా వెళుతుండగా మరో లారీ ఖమ్మం వైపు నుంచి కాకినాడ పోర్టుకు గ్రానైట్ రాళ్లు తరలిస్తోంది. స్టేషన్ సమీపంలో వెళుతున్న గ్రానైట్ రాళ్ల లోడు లారీని పండ్ల లోడుతో వెళుతున్న ఐషర్ వ్యాన్ ఓవర్ టేక్ చేసే సమయంలో ఒకదానికొకటి ఢీకొని రోడ్డుకు అడ్డంగా ఐషర్ వ్యాన్ బోల్తా పడింది. ముందు భాగం నుజ్జునుజ్జయింది. రహదారిపై గంటసేపు ట్రాఫిక్ నిలిచింది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వి.క్రాంతికుమార్ పరిశీలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో లారీల్లో వారికి ఎటువంటి ప్రాణహాని జరగలేదు.

అనుమతులు లేని శిశువిహార్ పాఠశాలకు మండల విద్యాశాఖ నోటీసులు


మండల విద్యాశాఖాధికారులకు లేఖ అందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్

పోలవరం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరంలో జిల్లా విద్యాశాఖ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న సిరివెన్నెల శిశువిహార్ పాఠశాలకు మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, మూర్తి శనివారం నోటీసులు అందించి మూయించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చంద్రకళ లిఖిత పూర్వకంగా పాఠశాలను మూసి వేస్తున్నట్టు విద్యాశాఖాధికారులకు లేఖ అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు సిరివెన్నెల శిశు పాఠశాలను మూసివేసినట్టు తెలిపారు. అనుమతులు లేని పాఠశాలలలో విద్యార్థులను చేర్పడం ద్వారా విద్యా సంవత్సరం వృథా అవుతుందని, ఇలాంటి పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందే 'తల్లికి వందనం' వంటి సంక్షేమ పథకాలు వర్తించవని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అనుమతులు నిరాకరించి పాఠశాలను మూసివేసిన నేపథ్యంలో పాఠశాల నిర్వాహకులు సిరివెన్నెల శిశువిహార్ పాఠశాల పేరు మార్చి ట్యూషన్ సెంటర్‌గా మారుస్తున్నట్టు ప్రకటించి పాఠశాల నిరంతరాయంగా నిర్వహించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.